వసంత్ కెమికల్స్‌లో అగ్నిప్రమాదం

కార్మికుడు మృతి

రియక్టర్ వద్ద వాయువు లీకై చెలరేగిన మంటలు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన నాయకులు, అధికారులు

మృతుడి కుటుంబానికి రూ.35 లక్షల పరిహారం

-వార్త మెయిన్‌లో..

ప్రత్యామ్నాయ పంట పండేనా?

- రెండేళ్ల క్రితం రూ.144 కోట్లతో 'పరివర్తన ప్రాజెక్టు' పేరిట ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- క్షేత్ర స్థాయిలో వివరాల సేకరణకు శ్రమించిన అధికారులు
- నిధులు లేవని ఆమోదించని గత వైసీపీ ప్రభుత్వం
- ఇటీవల మంత్రి సమక్షంలో ప్రస్తావించిన కలెక్టర్ దినేశ్‌కుమార్
- సానుకూలంగా స్పందించిన గుమ్మడి సంధ్యారాణి
- గిరిజన రైతుల్లో చిగురించిన ఆశలు



మన్యంలో గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలో 'పరివర్తన' పేరిట గంజాయికి ప్రత్యామ్నాయ పంట సాగుకు గత వైసీపీ ప్రభుత్వం మొండి చేయి చూపించింది. గంజాయి సాగు నుంచి గిరిజనుల్ని విముక్తి చేసి ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు వైపు వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో అధికారులు పంపిన ప్రతిపాదనలకు నిధులు విడుదల చేయకుండా నీరుగార్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ సాగును ప్రోత్సహిస్తామని ప్రకటించడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పెదబయలు మండలం కొరవంగిలో 'పరివర్తన' సమావేశం (ఫైల్)

మన్యంలో 18,660 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు అభివృద్ధి చేయాలని(పరివర్తన ప్రాజెక్టు) రూ.144 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు 2022 జూలై నెలలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే తమ వద్ద నిధులు లేవని పేర్కొంటూ ప్రతిపాదనను వైసీపీ ప్రభుత్వం ఆమోదించలేదు. దీంతో గంజాయి ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం లభించని పరిస్థితి కొనసాగింది.

ప్రతిపాదనలు పంపినా స్పందించని గత వైసీపీ సర్కారు

దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా అది విశాఖ మన్యంలో పండించింది కావడంతో గంజాయి సాగును నిర్మూలించాలని గత వైసీపీ ప్రభుత్వం 2022లో భావించింది. ఇందులో భాగంగా గిరిజనుల్ని గంజాయి సాగు నుంచి విముక్తి చేయడంతోపాటు, వారికి ప్రత్యామ్నాయంగా వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేసుకునేందుకు భారీ స్థాయిలో ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గ్రామ స్థాయిలోని అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో పోలీసులతో ప్రత్యేకంగా 'పరివర్తన' పేరిట సమావేశాలను అధికారులు నిర్వహించారు. గంజాయి సాగు వల్ల కలిగే నష్టాలను గిరిజనులకు వివరిస్తూ, ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహించే వ్యవసాయ, ఉద్యాన పంటల సాగును మాత్రమే చేపట్టాలని అవగాహన కల్పించారు. దీంతో సుమారుగా ఆరు నెలల పాటు ఏజెన్సీ వ్యాప్తంగా 'పరివర్తన' పేరిట ఒకటే హడావిడి చేశారు. ఆఖరికు డివిజన్ స్థాయి అధికారులతో పరివర్తన ప్రాజెక్టు అమలుపై ఐటీడీఏ కార్యాలయంలో 2022 జూలై నెలలో ప్రత్యేక ... మిగతా 8వ పేజీలో

గంజాయి ప్రత్యామ్నాయ పంట ప్రతిపాదన వివరాలు

పంట పేరు	విస్తీర్ణం (హెక్టార్లలో...)	బడ్జెట్ (రూ.కోట్లలో...)
వేరుశెనగ	800	రూ.3.79
వలిసెలు	2,000	రూ.4.23
రాగులు	8,000	రూ.8.32
రాజ్‌మా	4.000	రూ.12.16
డ్రాగన్‌ఫ్రూట్	40	రూ.7.76
లిచీ	40	రూ.1.29
పైనాపిల్	500	రూ.10.95
అవకాడో	40	రూ.1.44
స్ట్రాబెరీ	100	రూ.11.24
అల్లం	1,000	రూ.36.25
మిరియాలు	1,020	రూ.7.88
క్యాబేజీ	100	రూ.3.44
క్యాలీఫ్లవర్	100	రూ.2.58
బంగాళాదుంపలు	500	రూ.13.67
టొమేటో	300	రూ.8.60
పొట్ల కాయ	40	రూ.3.48
కాకరకాయ	40	రూ.3.48
ఆనపకాయ	40	రూ.3.47
మొత్తం	18,660 హెక్టార్లు	రూ.144 కోట్లు

నేరాల నియంత్రణకు టెక్నాలజీ వినియోగం

- విధి నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా పోలీసులను తీర్చిదిద్దుతాం
- స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా చేయడమే ప్రథమ కర్తవ్యం
- గంజాయి సాగు, రవాణాను కట్టడి చేస్తాం
- విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి



విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టిని బుధవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐజీ గోపినాథ్ జట్టి

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటానని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి అన్నారు. డీఐజీగా బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో గోపీనాథ్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా ప్రస్తుతం అన్ని రంగాలకు అనుగుణంగా టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని పేర్కొంటూ, పోలీసులు తమ విధి నిర్వహణలో సాంకేతికతను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతామన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఎక్కువగా చదువుకున్నవారే నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారన్నారు. సైబర్ నేరాలు, ఇతర నేరాల అదుపునకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకునేలా నిపుణులతో పోలీసులకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. అవసరమైన మౌలిక వసతులు సమకూర్చుకుంటామన్నారు. సోషల్ మీడియా వినియోగంలో ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుని ప్రాథమిక పోలీసింగ్ అమలు జరిగే విధంగా కృషి చేస్తానని గోపీనాథ్ జట్టి అన్నారు. పోలీస్ స్టేషన్ స్థాయిలోనే అందరికీ న్యాయం జరిగేలా చేయడమే ప్రథమ కర్తవ్యమని తెలిపారు. కేంద్రం అమలుచేసే కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నేరాల నియంత్రణకు 2014లో రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతిలో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి ఎస్పీగా ఉన్నప్పుడు మహిళలు, బాలికలపై దాడులు, వేధింపుల నివారణకు 'షీ' టీమ్స్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని డీఐజీ వెల్లడించారు. గంజాయి నిర్మూలనకు తగు చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా పొరుగునున్న ఒడిశా పోలీసులతో కలిసి ప్రణాళిక అమలు చేస్తామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. గంజాయి సాగును నిరోధించేందుకు అన్నిరకాల సాయం అందించనున్నదని పేర్కొన్నారు. గతంలో మూడున్నరేళ్లు విశాఖ జిల్లాలో పనిచేయడంతో ఏజెన్సీలోని అన్ని ప్రాంతాలపై అవగాహన ఉందని...గంజాయి సాగు, రవాణా నియంత్రణపై కఠినంగా ఉంటామన్నారు. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలు అణిచివేతకు పలు విభాగాలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున కూంబింగ్, దాడులు చేసిన మాదిరిగా... ఇప్పుడు గంజాయి నిర్మూలనకు విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని గోపినాథ్ జట్టి తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన డీఐజీని ... మిగతా 8వ పేజీలో

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుని పర్యటన రేపు

కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ వెల్లడి

పాడేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ ఈ నెల 19న జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ఆయన విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి పాడేరు చేరుకుంటారని, గిరిజన భవన్‌లో అన్ని గిరిజన సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి గిరిజన సమస్యలు, తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో గిరిజనాభివృద్ధికి చేపడుతున్న చర్యలపై సమావేశం నిర్వహిస్తారన్నారు. తరువాత అరకులోయ చేరుకుని అక్కడ హరితా రిసార్ట్‌లో టూరిజం, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి, విశాఖపట్నం బయలుదేరతారన్నారు.

19న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. ఈ మార్పును గిరిజన ప్రాంత ప్రజలు గమనించాలని, ఈనెల 19న ఎవరూ తమ అర్జీలను సమర్పించేందుకు ఐటీడీఏ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ సూచించారు.

కొనసాగిన ముసురు



పాడేరు మెయిన్ రోడ్డులో బుధవారం ముసురు వాతావరణం... వార్త 8లో

శిథిల క్వార్టర్లను పట్టించుకునే వారేరి?

నివాసానికి యోగ్యంగా లేని గృహాలు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు
- కొందరు మైదాన ప్రాంతాల నుంచి రాకపోకలు



రాజేంద్రపాలెం పీహెచ్‌సీ సిబ్బంది నివాస గృహాల దుస్థితి

కొయ్యూరు, జూలై 17: మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గురుకుల పాఠశాల సిబ్బంది నివాస గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వీటికి కనీసం మరమ్మతులపై పాలకులు దృష్టి సారించకపోవడంతో నివాసానికి అనుకూలంగా లేకుండా పోయాయి. దీంతో స్థానికంగా ఉండి సేవలందించాల్సిన ఉద్యోగులు మైదాన ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాలలో రోగులకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండలేకపోతున్నారు. వీటి మరమ్మతులకు గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ శాఖ పంపించిన ప్రతిపాదనలకు అతీగతీ లేకుండా పోయాయి. దీంతో రాజేంద్రపాలెం, డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు కొయ్యూరు గురుకుల పాఠశాల సిబ్బంది నివాస గృహాల దుస్థితి దారుణంగా తయారైంది.



శిథిలమైన డౌనూరు పీహెచ్‌సీ క్వార్టర్లు

రాజేంద్రపాలెంలో 1972వ సంవత్సరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేశారు. అప్పట్లో ఆరోగ్య కేంద్ర ఆవరణలో 14 మంది సిబ్బందికి 14 గృహాలు నిర్మించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు వీటి మరమ్మతులు నిర్వహించారు. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరాయి. ఈ ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి 24 గంటలు ఆసుపత్రిగా మార్చారు. దీంతో ఆరోగ్య కేంద్రానికి ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఆదివాసీల సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

- జిల్లా స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపు

పాడేరురూరల్, జూలై 17: ఆదివాసీలను పీడించే సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పాడేరు కాఫీ హౌస్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన అనేక ప్రజా సమస్యల పోరాటాలను కొనసాగించి జీవో నంబరు 3 పునరుద్ధరణ, ఆదివాసీ మాతృభాష విద్యా వలంటీర్లను రెగ్యులర్ చేయడం కోసం, ఏకలవ్య పాఠశాలల్లో స్థానికులను ఉపాధ్యాయులుగా నియమించాలని, తదితర గిరిజన ప్రాంత సమస్యలపై స్పందించాలని ఆయన కోరారు. జాతీయ రాజకీయ పరిస్థితులు, దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాల తీరు, ఓట్ల గణాంకాలను పార్టీ శ్రేణులకు వివరించి భవిష్యత్తు కార్యాచరణపై ఆయన దిశా నిర్దేశం చేశారు. బీజేపీ మతోన్మాద వైఖరిపై రాష్ట్రంలో టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు మాట్లాడడం లేదన్నారు. గత ఐదేళ్లలో బీజేపీకి మద్దతు ఇచ్చి రాష్ట్రంలో కేంద్రం చెప్పిందే చేసిన వైసీపీ ప్రభుత్వం ఇటీవల జరిగిన ఎన్నికల్లో పూర్తిగా అడుగంటిపోయిందన్నారు. అయినప్పటికి జగన్మోహన్‌రెడ్డి ఇంకా పాఠాలు నేర్చుకోవడం లేదని, మళ్లీ మోదీనే బలపరుస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో అడుగుపెట్టే అవకాశమే లేని బీజేపీకి టీడీపీ, జనసేన పార్టీలు పల్లకి మోస్తూ రాష్ట్రంలో బీజేపీ విస్తరణకు అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. బీజేపీని పూర్తిగా బలహీన పరిచేందుకు ఐక్య పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా సీపీఎం పట్ల ప్రజాభిమానం వెల్లువెత్తిందని, వచ్చే స్థానిక ఎన్నికల్లో సీపీఎం అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని ప్రజా క్షేత్రంలో దీటుగా నిలిచేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, డి.గంగరాజు, బి.చిన్నయ్యపడాల్, ఎస్.హైమావతి, ఉమ, బి.సన్నిబాబు, కె.త్రినాథ్, కె.రామారావు, ఎస్‌బీ పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను మలేరియా రహితంగా మార్చాలి

జిల్లాను మలేరియా రహితంగా మార్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. బుధవారం పాడేరు వచ్చిన ఆయన జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్యం అందుతున్న తీరు, మందుల ... మిగతా 8వ పేజీలో



కమ్మరితోట గ్రామంలో మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన అంగన్‌వాడీ కోడి గుడ్లు

మార్కెట్‌కు అంగన్‌వాడీ కోడి గుడ్లు

- తరలిస్తుండగా పట్టుకున్న కమ్మరితోట గ్రామస్థులు
- అంగన్‌వాడీ నిర్వాహకురాలిని నిలదీసిన వైనం
- ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- అప్పటి వరకు పిల్లలను కేంద్రానికి పంపించేది లేదని వెల్లడి

సీలేరు, జూలై 17: జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని కమ్మరితోట అంగన్‌వాడీ కేంద్రం నుంచి కోడి గుడ్లను అక్రమంగా ధారకొండ మార్కెట్‌కు తరలిస్తుండగా గ్రామస్థులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. దీనిపై అంగన్‌వాడీ నిర్వాహకురాలు, ఆమె భర్తను నిలదీశారు.

ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు, చిన్నారుల పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడి గుడ్లను వారికి అందజేయకుండా అంగన్‌వాడీ నిర్వాహకులు పక్కదారి పట్టించి వాటిని మార్కెట్‌లో దుకాణాలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కమ్మరితోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు రెడ్డి జయంతి తన భర్త ద్వారా 5 అట్టల గుడ్లు (150 గుడ్లు) ధారకొండ తరలించేందుకు తుప్పల మాటున సిద్ధం చేసి ఉంచారు. ఈ విషయం తెలిసి గ్రామస్థులు అక్కడికి చేరుకుని అంగన్‌వాడీ నిర్వాహకురాలు, ఆమె భర్తను నిలదీశారు. గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు గ్రామంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసే పాలు, గుడ్లు, ఇతర పౌష్టికాహారం సక్రమంగా సరఫరా చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీకి వచ్చే కోడి గుడ్లను పక్కదారి పట్టిస్తున్న నిర్వాహకురాలిపై చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించేది లేదని తేల్చి చెబుతున్నారు.

క్రైం... crime news

రైలు ఢీకొని టైల్స్ మేస్త్రి మృతి


కర్రి దుర్గ (ఫైల్)

ఎస్.రాయవరం, జూలై 17: మండలంలోని భీమవరం గ్రామ సమీపంలో రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందుకు సంబంధించి తుని రైల్వే ఎస్ఐ ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలివి. గెడ్డపాలెం గ్రామానికి చెందిన కర్రి దుర్గ (40) టైల్స్ మేస్త్రిగా పనిచేసేవారు. బుధవారం ఉదయం పని నిమిత్తం వెళుతూ భీమవరం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్నాడు. ఇంతలో విశాఖ నుంచి తుని వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతుడు దుర్గకు భార్యతో పాటు వర్షిత్ అనే తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇతడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట, జూలై 17: ఇక్కడి బయ్యవరం- నర్సింగబిల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని తుని రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్ల ఉంటాయని, సిమెంటు రంగు షార్టు, నీలం రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని వాటిపై సిమెంటు అని ముద్రించి ఉందని వివరించారు. ఇంతకు మించి ఎటువంటి వివరాలు లభించలేదన్నారు. కాగా ఏదో రైలు బండి ఢీకొని ఉంటుందని, అందువల్లే శరీర భాగాలన్నీ నుజ్జునుజ్జై ఉన్నాయని ఆయన వివరించారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. కుటుంబ సభ్యులు తమను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

లారీ ఢీకొని రైతు మృతి

అనకాపల్లి టౌన్, జూలై 17: ఇక్కడి జాతీయ రహదారిలోని ఉమ్మలాడ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్ర గాయాలకు గురయ్యాడు. విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు తెలిపిన వివరాలివి. మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామానికి చెందిన ఆడారి పరదేశినాయుడు (71) అనే రైతు ఉమ్మలాడ జంక్షన్ వద్ద బుధవారం రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో విశాఖ నుంచి తుని వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో అతని రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ పరదేశినాయుడు సాయంత్రం మృతి చెందినట్టు సీఐ చెప్పారు. మృతుడి కుమారుడు జగదీశ్వరరావు ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఏఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

నర్సీపట్నం, జూలై 17: కడుపు నొప్పి భరించ లేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడలో నివాసం ఉంటున్న తుంపాల ఈశ్వరరావు సోమవారం వెంకునాయుడుపేటలో ఉంటున్న తమ్ముడు శ్రీను ఇంటికి వచ్చాడు. మంగళవారం కడుపునొప్పిగా ఉందంటూ సోదరుడితో చెప్పాడు. ఆస్పత్రికి తీసుకు వెళ్లేలోగా కడుపు నొప్పి భరించ లేక విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతిడి తమ్ముడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

12 మంది పేకాటరాయుళ్లపై కేసు

▸ రూ.18,340 స్వాధీనం

బుచ్చెయ్యపేట, జూలై 17: వడ్డాదిలో పేకాట శిబిరంపై బుధవారం బుచ్చెయ్యపేట పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాటాడుతున్న 12 మందిపై కేసు నమోదు చేసి, 18 వేల 340లతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

కండక్టర్‌పై ఇంటర్ విద్యార్థి దాడి

నర్సీపట్నం, జూలై 17: ఆర్టీసీ కండక్టర్‌పై ఇంటర్ విద్యార్థి దాడి చేసిన ఉదంతంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాదేవిపేటకు చెందిన కోగాడ చిట్టిబాబు నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. మంగళవారం స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థి స్వగ్రామం మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం వెళ్లడానికి నర్సీపట్నంలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. టిక్కెట్టు ఇచ్చేటప్పుడు కండక్టర్ చిల్లర అడిగారు. దీంతో విద్యార్థి మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో విద్యార్థి.. కండక్టర్ విధులకు భంగం కలిగించి దాడి చేసి కొట్టాడు. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పట్టపగలు అంతా చూస్తుండగా.. సెల్‌ఫోన్ చోరీ

ఎలమంచిలి, జూలై 17 : పట్టణంలో బుధవారం మధ్యాహ్నం ప్రధాన రోడ్డుపై అందరూ చూస్తుండగానే సినీ ఫక్కీలో సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోవడం కలవరానికి గురిచేసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఎలమంచిలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బి.లక్ష్మణరావు ఎస్‌బీఐ సమీపంలోని ప్రధాన రోడ్డుపై ఉన్నారు. ఇంతలో ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి వాహనం పడిపోతున్నట్టు సీన్ క్రియేట్ చేశాడు. ఇది చూసిన సదరు రిటైర్డు ఉపాధ్యాయుడు వాహనంపై నుంచి అతడు పడిపోకుండా సహాయం చేస్తున్న సమయంలో వెనుకనుంచి మరో యువకుడు వచ్చాడు. రిటైర్డు ఉపాధ్యాయుడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నాడు. అనంతరం ఆ ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ తరహా సంఘటనలు పట్టణంలో పరిపాటిగా మారడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి వారి ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

గేదెపై శునకం సవారీ...


గేదెపై కూర్చొని స్వారీ చేస్తున్న శునకం

గుర్రంపై మనుషులు స్వారీ చేయడం సర్వసాధారణం.. గేదెపై ఓ శునకం స్వారీ చేయడమే సంభ్రమాశ్చర్యం! చదవడానికి విడ్డూరంగా ఉన్నా, పై చిత్రాలను చూస్తూ 'అబ్బో ఇది నిజమే' అనిపిస్తుంది. ఇక్కడితో సీన్ అయిపోలేదండోయ్..! స్వారీ చేయడానికి ముందు రోడ్డుపై వెళ్తున్న గేదెపైకి సదరు శునకం జంప్ చేసి మరీ కూర్చొవడం, దాదాపు కిలోమీటరు దూరం దాన్ని కిందకు పడేసే పని చేకుండా గేదె నిదానంగా ముందుకు సాగడం విశేషం. చింతపల్లి సబ్ జైలు నుంచి సంతబయలు వరకు రహదారిపై తారసపడ్డ ఈ చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా ఇలా క్లిక్‌మనిపించింది.

- చింతపల్లి

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

వరి ఆకుమడులకు తెగుళ్లు

▸ రైతుల్లో ఆందోళన


వరినారు మడులకు రసాయనిక మందు పిచికారి చేస్తున్న రైతు


బంగారుమెట్టలో బూజు తెగులుతో దెబ్బతిన్న వరి నారు

బుచ్చెయ్యపేట, జూలై 17: మండలంలో వరి ఆకుమడులకు తెగులు సోకుతోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మండలంలో 6500 ఎకరాల్లో వరిసాగుకు రైతులు వరి ఆకులు పోశారు. వడ్డాది, మంగళాపురం, విజయరామరాజుపేట, లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీపీ అగ్రహారం, పొట్టిదొరపాలెం, రాజాం, నీలకంఠాపురం, బుచ్చెయ్యపేట, చినఅప్పన్నపాలెం, పోలేపల్లి, దిబ్బిడి, పి.భీమవరం, కోమళ్లపూడి, గంటికొర్లాం, కొండెంపూడి, గున్నెంపూడి, పెదమదీన, కేపీ అగ్రహారం తదితర గ్రామాల్లో వరి ఆకుకు పోడ, మొవ్వుకుళ్ళు, అగ్గి, బూజు తెగులు సోకడంతో వరి ఆకు దెబ్బతింది. రోజురోజుకూ తెగులు ఎక్కువ కావడంతో రైతులు రసాయనిక మందులు పిచ్చికారీ చేస్తున్నారు.

ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వాతావరణంలో మార్పులతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూన్ మూడో వారం వరకు మురిపించిన వర్షాలు మొహం చాటేయడంతో వర్షాధారంపై ఆధారపడి వరి సాగు చేస్తున్న ఎర్రవాయి ప్రాంత రైతులు అధిక వ్యయ, ప్రయాసాలకు ఓర్చి ఆకుమడులు తడులు అందించారు. ఇప్పుడు నారుమడులకు తెగులు సోకడంతో రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కాగా.. పొడ, బూజు తెగులు నివారణకు ఎగ్జాకాన్‌జోల్ లీటరు నీటికి 2 ఎంఎల్ మందు కలిపి పిచ్చికారి చేయాలని ఏవో భాస్కరరావు తెలిపారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ లీటరు నీటికి ఒక గ్రాము పౌడరు కలిపి పిచికారీ చేయాలు సూచించారు. మొవ్వు కుళ్లు తెగులు నివారణకు 30 కేజీల విత్తనాల బస్తాకు ఒక కేజీ 3 జి గుళికలు, లేదా క్లోరోపైరిపాస్ (20ఈసీ) లీటరు నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

సానుకూల దృక్పథంతో సమర్థంగా సేవలు

▸ బదిలీపై వెళుతున్న ఎస్పీ మురళీకృష్ణకు ఘన సత్కారం

▸ జిల్లాలో ఆయన అందించిన సేవలను కొనియాడిన అధికారులు

▸ అందరికీ కృతజ్ఞతలు తెలిపిన ఎస్పీ



మురళీకృష్ణ దంపతులను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

అనకాపల్లి టౌన్, జూలై 17 : అనకాపల్లి జిల్లా ఎస్పీగా పనిచేసి బదిలీపై అనంతపురం వెళుతున్న కేవీ మురళీకృష్ణ దంపతులను ఇక్కడ ఘనంగా సత్కరించారు. రింగురోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఆత్మీయ వీడ్కోలు సభలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ మాట్లాడుతూ శాంతిభద్రతలను పరిరక్షించే విషయంలో, ఎన్నికల విధుల సమయంలోనే కాకుండా, సమస్యాత్మక విషయాలకు సైతం ఎస్పీ మురళీకృష్ణ సున్నిత దృక్పథంతో చక్కని పరిష్కార మార్గాలను చూపేవారన్నారు. ఒక అధికారిగా ఆయనకు గొప్ప లక్షణమని పేర్కొన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలు గతంలో అధికంగా ఉండేవని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని నివారించామన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలను కట్టడి చేసేందుకు రహదారులపై అవకాశం ఉన్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి వాహనాల వేగాలను తగ్గించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో జిల్లాలో చెదురుమదురు సంఘటనలు మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమర్థవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించగలిగామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతం ఎస్పీ దంపతులను, వారి తల్లిదండ్రులను జిల్లా పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ హెచ్‌వోడి డాక్టర్ శిల్పా, డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, జీఆర్ఆర్ మోహన్, బి.అప్పారావు, ఎం.ఉపేంద్రబాబుతో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వసంత్ కెమికల్స్‌ను సందర్శించిన ఎమ్మెల్యే సుందరపు

▸ కంపెనీ ప్రతినిధులతో చర్చలు

▸ మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆదేశం


కంపెనీలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కంపెనీ ప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, జూలై 17: మండలంలోని ఎస్ఈజడ్‌లో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగిన వసంత్ కెమికల్స్ కంపెనీని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను పరామర్శించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. కంపెనీలో మృతి చెందిన కుటుంబానికి పరిహారం అందించడంతో పాటు, కంపెనీ నుంచి వచ్చే ప్రయోజనాలను ఆ కుటుంబానికి అందించాలని స్పష్టం చేశారు. సెజ్‌లోని కంపెనీల్లో ఇలాంటి సంఘటలను పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా, మృతుడి కుటుంబీకులు ఒడిశా నుంచి రావాల్సి ఉందని, పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని ఆయన కుటుంబీకులకు అందజేయడం జరుతుందని రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు.

ఎమ్మెల్యే వెంట టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడా నాగేశ్వరరావు, బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గం కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు, బీజేపీ నేత బీవీఎస్ వర్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ద్వారపు రెడ్డి పరమేశ్వర రావు, పల్లి రాజాబాబు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జేఎస్ రాజు, జనసేన పార్టీ అచ్యుతాపురం మండలశాఖ అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు, అచ్యుతాపురం మాజీ జడ్పీటీసీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

యానాద్రి కాలువకు మహర్దశ

పూడిక తీసి, అభివృద్ధి చేయాలని దీర్ఘకాలంగా వేడుకున్నా పట్టని అధికారులు

▸ వివిధ రూపాల్లో ఆందోళనలు చేసిన పట్టణవాసులు

▸ ఓవైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో ఇబ్బందులు

▸ ఎట్టకేలకు స్పందించడంతో అంతా ఆనందం


కొత్తపేట వద్ద పూడిక తీసి, కాలువ అభివృద్ధి చేసిన దృశ్యం

ఎలమంచిలి, జూలై 17: దశాబ్ద కాలం తరువాత పట్టణంలో ఉన్న యానాద్రి కాలువలో పూర్తిస్థాయిలో పూడిక తీత పనులు చేపడుతున్నారు. కొత్తపేట ప్రాంతంలో ఈ కాలువ సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. ఇందులో పూడిక పేరుకుపోవడంతో ఎక్కడికక్కడ చెత్తాచెదారం నిలిచిపోయేది. దీంతో మురుగు ముందుకు పారలేని పరిస్థితి నెలకొనేది. ఈ సమస్యను పరిష్కరించాలని ఎలమంచిలి వాసులు పలుమార్లు అధికారులకు విన్నవించినా, వివిధ రూపాల్లో ఆందోళనలు చేట్టినా పటించుకునేవారు కరువయ్యారు. దీంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో ఆయా ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఎట్టకేలకు మునిసిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఈ సమస్యపై దృష్టి సారించారు. తొలుత కొత్తపేట వార్డు వద్ద కాలువలో పూడిక తొలగించడంతో అక్కడి వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, పాలకవర్గ సభ్యులు, అధికారులు పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మరికొద్ది రోజుల్లో పనులు పూర్తికానున్నాయని డీఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావులు తెలిపారు.


పనులను పరిశీలించేందుకు వచ్చిన మునిసిపల్ పాలకవర్గం

విద్యుత్ బకాయిలు రూ.319.77 కోట్లు

▸ ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్‌లో ప్రభుత్వ సంస్థల నుంచి రావలసింది రూ.124.03 కోట్లు

▸ మైనర్‌పంచాయతీల నుంచి రూ.170.76 కోట్లు

▸ జీవీఎంసీ బకాయి రూ.22.96 కోట్లు

▸ మునిసిపాలిటీలు రూ.2.03 కోట్లు

▸ విశాఖ కలెక్టరేట్ రూ.8.18 కోట్లు

▸ రోడ్లు, భవనాల శాఖ రూ.6.17 కోట్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లోనివిశాఖపట్నం సర్కిల్‌కు వివిధ ప్రభుత్వ, స్థానిక పరిపాలన సంస్థల నుంచిరావలసిన బకాయిలు పెరిగిపోతున్నాయి. జూన్ నెలాఖరు నాటికి విశాఖసర్కిల్‌లో రూ. 319.77 కోట్లు రావలసి ఉంది. ఈ సర్కిల్‌లో అనకాపల్లి, కశింకోట, నర్సీపట్నం, పాడేరు డివిజన్లు గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి.

జోన్-1, జోన్ 2, జోన్-3 డివిజన్లు విశాకపట్నం నగరంలో ఉన్నాయి. ప్రైవేటు అంటే గృహ, ప్రైవేటు పారిశ్రామిక సంస్థల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలోనే వసూలు అవుతున్నాయి. దాదాపుగా 90 శాతం కలెక్షన్ ఉంటోంది. ఎవరైనా బకాయి ఉంటే వారికి విద్యుత్ కనెక్షన్ తీసేస్తుండడంతో వెంటనే బకాయి చెల్లించి సరఫరా పునరుద్ధరించుకుంటున్నారు. అదే ప్రభుత్వ సంస్థల విషయానికి వచ్చేసరికి అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయలేక పోతున్నారు. నోటీసులు మీద నోటీసులు ఇవ్వడం తప్పితే అటు నుంచి పెద్దగా స్పందన ఉండడం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని, అందుకే బిల్లులు చెల్లించలేకపోతున్నామని సదరు ప్రభుత్వ విభాగాల అధిపతులు చెబుతున్నారు. అదేవిధంగా జీవీఎంసీ, మునిసిపాలిటీలు, పంచాయతీలు కూడా విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. ఎంత ఆలస్యమైనా ఈపీడీసీఎల్ అధికారులు వేచిచూడడం తప్పితే సరఫరా నిలిపివేయలేరనే ధీమా వల్ల స్థానిక సంస్థలు తీరుబడిగా, మిగులు నిధులు ఉన్నప్పుడు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాయి. జూన్ నెలాఖరు నాటికి ప్రభుత్వ సంస్థల నుంచి రూ.124.03 కోట్లు, మైనర్ పంచాయతీల నుంచి రూ.170.76 కోట్లు, జీవీఎంసీ నుంచి రూ.22.96 కోట్లు, మునిసిపాలిటీల నుంచి రూ.2.03 కోట్లు బకాయిలు రావలసి ఉంది. డివిజన్ల వారీగా చూసుకుంటే అనకాపల్లి డివిజన్ నుంచి రూ.29.31 కోట్లు, కశింకోట డివిజన్ నుంచి రూ.91.72 కోట్లు, నర్సీపట్నం నుంచి రూ.39.63 కోట్లు, పాడేరు నుంచి రూ.79.66 కోట్లు బకాయిలు రావలసి ఉంది. విశాఖ నగరంలో చూసుకుంటే జోన్-1 డివిజన్ నుంచి రూ.31.56 కోట్లు, జోన్-2 నుంచి 9.50 కోట్లు, జోన్-3 నుంచి రూ.38.39 కోట్లు వసూలు కావలసి ఉంది.

ఒక్క జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే రూ.8.18 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఐటీ శాఖ నుంచి రూ.2.42 కోట్లు, పరిశ్రమల శాఖ నుంచి రూ.3.32 కోట్లు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ నుంచి రూ.6.17 కోట్లు, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రూ.21.4 కోట్ల బిల్లులు వసూలు కావలసి ఉంది. అందరికీ నోటీసులు ఇచ్చామని, ఎంతో కొంత చెల్లించాలని కోరామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేంద్రనాథ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

శ్రీరంగనాథుడి అవతారంలో జగన్నాథుడు


శ్రీరంగనాథుడి అవతారంలో జగన్నాథుడు

చోడవరం, జూలై 17: జగన్నాథుడి రథోత్సవాల సందర్భంగా దశరూపావతార మహోత్సవాల్లో భాగంగా బుధవారం జగన్నాథస్వామి భక్తులకు శ్రీరంగనాథుడి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణి బాబు, ఉప్పల బాబు, ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలతో సీతారాముల అలంకరణ



నర్సీపట్నం అర్బన్, జూలై 17: మండలంలోని దుగ్గాడ రామాలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు కూరగాయలతో అలంకరించిన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిద్ర లలిత, నాయకులు శ్రీనివాసరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గాడలోని రామాలయంలో కూరగాయలతో అలంకరించిన సీతారాములు

శాకాంబరిగా దుర్గాదేవి



స్థానిక దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా శాకాంబరి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం దుర్గాదేవిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. శాకాంబరి అవతారం ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- నర్సీపట్నం

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

▸ భక్తులతో వడ్డాది గిరిజాంబగిరి కిటకిట


వడ్డాదిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట, జూలై 17: మండలంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని మంగళ వారం ఘనంగా జరుపుకున్నారు. వడ్డాదిలో గిరిజాంబగిరిపై కొలువైయున్న స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారిని అర్చకులు పలు రకాలు పుష్పాలతో అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా పలువురు భక్తులు ఉపవాస దీక్ష ఆచరించారు.

వ్యర్థ రసాయనాల ట్యాంకర్‌పై విచారణ జరపాలి

▸ గుట్టుగా సముద్రంలోకి విడిచి పెడుతుండడం దారుణం

▸ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు 'గనిశెట్టి'

పరవాడ, జూలై 17 : పెదగంట్యాడ మండలం గంగవరం బ్రిడ్జి వద్ద వ్యర్థ రసాయనాల లోడుతో సోమవారం రాత్రి పట్టుబడ్డ ట్యాంకర్ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం ఇక్కడ డిమాండ్ చేశారు. భారీగా వ్యర్థ రసాయనాలను గుట్టు చప్పుడు కాకుండా ట్యాంకర్ ద్వారా సముద్రంలోకి విడిచి పెట్టడం దారుణమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో తక్షణమే ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రమాదకరమైన వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ట్యాంకర్ యాజమానితో పాటు వ్యర్థాలతో సంబంధమున్న ఫార్మాసిటీ యాజమాన్యాన్ని కూడా అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరిపించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తరహా సంఘటనలు జరగకుండా జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రెండు కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

పాయకరావుపేట రూరల్, జూలై 17 : నామవరంలో బుధవారం గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పాయకరావుపేట పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని నామవరంలో గల వైభవ్ టౌన్ షిప్ ఆర్చ్ వద్ద తమ సిబ్బంది బుధవారం మాటు వేశామన్నారు. మోటారు సైకిల్‌పై వచ్చిన నక్కపల్లి మండలం చినరామభద్రపురం గ్రామానికి చెందిన వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా, సుమారు రెండు కిలోల గంజాయి కవర్‌లో ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. ఇతడు కొంత మంది వ్యక్తులతో కలిసి గంజాయిని కొనుగోలుచేసి, వందగ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్లుచేసి విక్రయిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. నిందుతుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు చెప్పారు.

తెరిపివ్వని వర్షం..

జల దిగ్బంధంలో మన్యంలోని పలు గ్రామాలు

వాన నీటిలో మునిగిపోయిన లోతట్టు ప్రాంతాలు

చెరువులను తలపిస్తున్న రహదారులు
గిరిజనులు, వాహన చోదకుల అగచాట్లు
గెడ్డలు, వాగులపై ప్రమాదకరంగా రాకపోకలు



జి.మాడుగుల యూనియన్ బ్యాంకు సమీపంలో చెరువులను తలపిస్తున్న రోడ్డు





ముంచంగిపుట్టు: దొరగూడ వద్ద ప్రమాదకరంగా మత్స్యగెడ్డ దాటుతున్న గిరిజనులు

జి.మాడుగుల, జూలై 17: మన్యంలో భారీ వర్షాలకు పలు మండలాలు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. రహదారుల గోతుల్లో నీరు చేరిపోయి చెరువలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమ్యాయి.

జి.మాడుగుల మండలంలోని వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతోప్రధాన రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. జి.మాడుగుల-చింతపల్లి ప్రధాన రహదారి ఇది దరకే గుంతలు మయంగా మారి చిన్నపాటి వర్షాలకు నీరు ప్రవేశించి వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యేది. దీనికితోడు మండల కేంద్రంలో ప్రధాన రహదారికి డ్రైనేజీ వ్యవస్థ పేరుకుపోవడంతో రహదారి మీదుగా నీరు ఏరులై పారడంతో వాహనదారులతో పాటు పాదచారులకు సైతం ఇబ్బందులు తప్పడ లేదు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ముందుర భాగం నుంచి యూనియన్ బ్యాంక్ సమీపం వరకు రహదారిలోని డ్రైనేజీ నీరు చేరి చెరువును తలపిస్తోంది. ఈ సమస్య తెలిసినా అధికార యంత్రంగానికి చీమ కుట్టినట్టు కూడా లేదని వాహన చోదకులు, స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యగెడ్డ పాయల్లో తగ్గని నీటి ఉధృతి

ముంచంగిపుట్టు: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని 23 పంచాయతీల పరిధిలో వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రెండు రోజులుగా వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ నీటి ఉధృతి మాత్రం తగ్గలేదు. దీంతో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి.లక్ష్మీపురం, రంగబయలు, బూసిపుట్టు, బుంగాపుట్టు, దారెల, పనస పుట్టు, బంగారుమెట్ట తదితర పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లక్ష్మీపురం పంచాయతీ కర్లాపొదర్, ఉబ్బెంగుల, దొరగూడ, బిర్రుగూడ ప్రాంతాల్లో మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహించడంతో ఏవోబీలోని సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు నరకం చూస్తున్నారు. గెడ్డ అవతల జీవిస్తున్న ప్రజలకు బాహ్యాప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పంచాయతీ, మండల కేంద్రాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అత్యవసరమైతే తప్ప గ్రామ పొలిమేర దాటేందుకు ఎవరూ సాహించలేకపోతున్నారు. ప్రస్తుతం ఏ వ్యాధి సోకినా, ఆరోగ్య సమస్యలు తలెత్తినా పలు గ్రామాల ప్రజలు గెడ్డ దాటి రాలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి మత్స్యగెడ్డ పాయలపై కల్వర్టులు, వంతెనలు నిర్మించాలని, పక్కా రహదారులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

జాలర్ల వలకు భారీ చేప



ముంచంగిపుట్టు, జూలై 17: కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో మత్స్యకారుల వలకు భారీ బంగారుపాప చేపలు చిక్కుతున్నాయి. వర్షాలకు నీరు బురదమయంగా మారవడంతో చేపలు పైకి వస్తుంటాయి. దీంతో వర్షాకాలంలో మత్స్యగెడ్డలో భారీ చేపలు దొరుకుతాయి. సుజనకోట, గొడుగులపుట్టు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డలో బుధవారం జాలర్ల వలకు భారీ బంగారుపాప చేపలు చిక్కాయి. ఒకొక్కటి సుమారు పది నుంచి 15 కిలోల వరకు బరువు ఉంది. అవి ఒడ్డుకు తీసుకువచ్చిన కొద్ది సేపటికే హాట్ కేక్‌లా విక్రయాలు జరిగిపోయాయి. ప్రస్తుతం కిలో రూ.300 వరకు ధర పలుకుతుంది.

చింతపల్లి రోడ్డులో దుకాణాల తొలగింపు

» నాబార్డు షెడ్లలో వ్యాపారాల నిర్వహణకు ఏర్పాట్లు.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



నాబార్డు షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసిన దృశ్యం

చింతపల్లి, జూలై 17: మండల కేంద్రంలోని వారపు సంతలో రహదారికిరువైపులా వ్యాపారులు ఏర్పాటు చేసిన దుకాణాలను పంచాయతీ అధికారులు తొలగించారు. నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన షెడ్లలోకి బుధవారం సంతను మార్చేశారు. అక్కడే దుకాణాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కార మార్గం లభించినట్టయింది. 'వారపు సంతలో ట్రాఫిక్ చిక్కులు' అనే శీర్షిక ఈ నెల 11వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వారపు సంత నిర్వహించాలని డీఎల్‌పీవో పీఎస్ కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం చింతపల్లి వచ్చిన ఆయన సంత జరిగే ప్రాంతానికి పరిశీలించి పంచాయతీ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతో బుధవారం గ్రామ సర్పంచ్ దురియా పుష్పలత, కార్యదర్శి కొరుప్రోలు శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. అక్కడి నుంచి నాబార్డు నిధులతో నిర్మించిన సంత షెడ్ల వద్దకు తరలించారు. ప్రధానంగా జీసీసీ డిపో నుంచి డిగ్రీ కళాశాల వరకు రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసే దుకాణాలను ఖాళీ చేయించారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా విలేకరులతో సర్పంచ్ మాట్లాడుతూ ప్రతీ వారం సంతకు వచ్చే వర్తకులు నాబార్డు, పంచాయతీ నిధులతో నిర్మించిన షెడ్లలో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రహదారికిరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తే పంచాయతీ అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారన్నారు. ప్రస్తుతం సంత షెడ్లు కూరగాయల వ్యాపారులకు, ఇతర ఖాళీ స్థలాన్ని ఇతర దుకాణాలకు కేటాయించామన్నారు. సంతలో వర్తకులు, వినియోగదారులు తప్పనిసరిగా పంచాయతీ నిబంధనలు పాటించాలని ఆమె స్పష్టం చేశారు.

గరిష్ఠ స్థాయికి డుడుమ నీటి మట్టం



నిండుకుండను తలపిస్తున్న డుడుమ జలాశయం

ముంచంగిపుట్టు, జూలై 17: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే డుడుమ జలాశయంలో నీటి నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరాయి. మొత్తం 2590 అడుగులు నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, బుధవారం 2586 అడుగుల నీటి మట్టం నమోదైందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో జలాశయానికి ఎగువ ప్రాంతంలో ఉన్న జోలాపుట్టు జలాశయం నుంచి నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటి నిల్వలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అలాగే విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన నీటిని డుడుమ నుంచి సరఫరా చేస్తున్నారు.

ఆదివాసీ సంప్రదాయ కేంద్రం ప్రారంభోత్సవం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో వంజంగి గ్రామంలో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ సంప్రదాయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ప్రారంభోత్సవం చేశారు. వంజంగి హిల్స్‌ను సందర్శించడానికి విచ్చేసే పర్యాటకులకు ఆదివాసీల సంప్రదాయాలను పరిచయం చేయాలనే లక్ష్యంతోనే దీన్ని ఏర్పాటు చేశామని సీపీఎఫ్ డైరెక్టర్ గిరిజాదేవీ తెలిపారు. ఈ కేంద్రాన్ని సందర్శిస్తే గిరిజనులు సంప్రదాయాలు, ఆచారాలు, జీవన శైలిపై అవగాహన కలుగుతుందన్నారు. అలాగే పర్యావరణం దెబ్బతినకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో సీపీఎఫ్ మేనేజింగ్ ట్రస్టీ కామేశ్వరరావు, పీవోలు లోకేశ్, సత్యనారాయణ, నాగమణి, బాలరాజు, వంజంగి కాంతమ్మ పాల్గొన్నారు.

ఐటీడీపీ ఇన్‌చార్జి శ్రీధర్‌కు గిడ్డి ఈశ్వరి పరామర్శ

పాడేరు రూరల్, జూలై 17: విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చింతపల్లి ఐటీడీపీ ఇన్‌చార్జి ఎస్.శ్రీధర్‌ను టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి బుధవారం పరామర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీటీసీని పరామర్శించిన ఎంపీ

హుకుంపేట: హుకుంపేట ఎంపీటీసీ సభ్యురాలు కె.రమ కుటుంబ సభ్యులను అరకు పార్లమెంట్ సభ్యురాలు తనుజారాణి బుధవారం పరామర్శించారు. రమ భర్త సింహాచలం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. సింహాచలం భార్య రమ, వారి పిల్లలను ఎంపీ పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి చేదోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పాల్గుణ కూడా రమా కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వాణిజ్య శాఖ జిల్లా అధ్యక్షుడు శామ్యూల్, మండల అధ్యక్షుడు కొండబాబు, సర్పంచ్ పూర్ణిమ పాల్గొన్నారు

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

పాడేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఓపెన్ ఆడిటోరియంలో బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. బ్రహ్మకుమారీస్, ఓం శాంతి ఆశ్రమం ఆధ్వర్యంలో 108 జంటలతో బెంగళూరుకు చెందిన ఆధ్యాత్మిక గురువు మంజునాథ్ సామూహిక సత్యనారాయణ వ్రతాలను చేయించారు. చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంట పండేనా?


... 5వ పేజీ తరువాయి

సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ స్థాయిలో గిరిజనులు గంజాయి సాగు చేస్తున్న వివరాలతోపాటు వారికి ప్రత్యేకంగా ఎటువంటి పంటలకు సంబంధించిన విత్తనాలు ఇవ్వాలనే దానిపై అధికారులు భారీ కసరత్తు చేసి పరివర్తన ప్రాజెక్టుకు రూ.144 కోట్లు అవసరమని ప్రతిపాదనలు రూపొందించారు. దానిని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

గంజాయి సాగు, రవాణాను శాశ్వతంగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఉన్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గిరిజన ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలపై ఈ నెల 10న అధికారులతో ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నిర్వహించిన సమావేశంలో గంజాయి సాగు-నిర్మూలన ప్రధాన అంశంగా చర్చ సాగింది. ఈ క్రమంలో గిరిజనుల్ని గంజాయి నుంచి విముక్తి చేసేందుకు రెండేళ్ల క్రితమే రూ.144 కోట్ల అంచనా వ్యయంతో ప్రత్యామ్నాయ పంట సాగుకు ప్రతిపాదన చేశామని, ప్రణాళిక ప్రకారం నిధులు విడుదల చేస్తే చక్కని ఫలితాలు వస్తాయని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్.. మంత్రి సంధ్యారాణి వద్ద ప్రస్తావించారు. గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. దీంతో రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహానికి సంబంధించిన పరివర్తన ప్రాజెక్టు కార్యరూపం దాల్చే అవకాశాలున్నాయని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చనిదనమే.. పచ్చదనమే!



ఏజెన్సీలో ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. పొలాలు పచ్చదనంతో నిండిపోయి కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ నేపథ్యంలో రైతులు వరి నారు మడులను సిద్ధం చేస్తుండడంతో, నారు పెంచిన పొలాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. పాడేరు మండలం గొందూరు కాలనీ సమీపంలోని పచ్చదనంతో నిండిన వరి నారు దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

-ఆంధ్రజ్యోతి/పాడేరు

నేరాల నియంత్రణకు టెక్నాలజీ వినియోగం

... 5వ పేజీ తరువాయి

సిటీ జాయింట్ సీపీ ఫకీరప్ప, అనకాపల్లి ఎస్పీ దీపికా పాటిల్, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

విశాఖ నుంచి ఉద్యోగ జీవితం ప్రారంభం

2008 బ్యాచ్‌కు చెందిన గోపినాథ్ జట్టి ఐపీఎస్ శిక్షణ పూర్తిచేసుకున్న తరువాత 2010లో విశాఖ జిల్లాలో ట్రైనీగా చేరారు. శిక్షణ తరువాత విశాఖలోనే గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండెంట్‌గా, తరువాత చింతపల్లి ఏఎస్పీగా పనిచేశారు. మొత్తం మూడున్నరేళ్లు విశాఖ జిల్లాలో పనిచేసి, 2013లో గుంటూరు ఏఎస్పీగా బదిలీపై వెళ్లి...అక్కడే ఎస్పీగా పదోన్నతి పొందారు. రాష్ట్ర విభజన అనంతరం తిరుపతి ఎస్పీగా, ఆ తరువాత మంగళగిరిలో ఆరో బెటాలియన్ కమాండెంట్‌గా, కర్నూలు ఎస్పీగా పనిచేసి 2018లో టీటీడీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులై మూడున్నరేళ్లు పనిచేశారు. 2022లో పదోన్నతి రావడంతో గ్రేహౌండ్స్ డీఐజీగా పోస్టింగ్ పొందారు.

ఆదివాసీల సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

... 5వ పేజీ తరువాయి

సరఫరాలపై రోగులను అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రిలో మలేరియా రోగులను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతాన్ని మలేరియా రహిత జిల్లాగా మార్చేందుకు అవకాశాలు ఉన్నప్పటికి ప్రభుత్వం సమర్థంగా కృషి చేయడం లేదని విమర్శించారు. హైరిస్క్ గ్రామాలను ముందుగా గుర్తించి ఆయా గ్రామాల్లో ముందుగా దోమల మందుల పిచికారీ చేయకపోవడం వల్ల మలేరియా పెరిగిందన్నారు. జ్వర బాధితులకు ప్రత్యేకంగా రక్త పరీక్షలు నిర్వహించాలని, వైద్య శిబిరాల నిర్వహణతో మలేరియా నివారణకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పాడేరులో ప్రభుత్వ మెడికల్ కళాశాలను తక్షణమే ప్రారంభించాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అవలంబించరాదని కోరారు. ఆయన వెంట సీపీఎం నాయకులు లోకనాథం, అప్పలనర్స సురేంద్ర వున్నారు.

కర్నికలంకలో ప్రత్యేక వైద్య శిబిరం

జి.మాడుగుల, జూలై 17: మండలంలోని సింగర్భ పంచాయతీ కర్నిలంక గ్రామంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి శశికాంత్ రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. జ్వర పీడితులకు ఆర్‌డీటీలు వేశారు. వాతావరణం మార్పుల వల్ల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా వైద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎన్.ప్రకాశ్, శోభన్, దేవుడమ్మ, బాలమణి పాల్గొన్నారు.

పల్లా దృష్టికి మండల సమస్యలు

డుంబ్రిగుడ, జూలై 17: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును పార్టీ మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వీటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని పల్లా హామీ ఇచ్చినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, టీఎన్‌టీయుసీ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు తెలిపారు.

కొనసాగిన ముసురు

పాడేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో బుధవారం ముసురు వాతావరణం నెలకొంది. పాడేరులో జల్లులతో కూడిన వాన పడగా, ఇతర ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. గత మూడు రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతం కాగా, ఒడిశాను ఆనుకుని ఉన్న పెదబయలు, ముంచంగిపుట్టు, జీకేవీధి మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో అప్పుడప్పుడు జల్లులతో కూడిన వాన పడుతున్నది. సుమారు వారం రోజులుగా ఏజెన్సీలో ఎండ జాడ లేకుండా పోయింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీలో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.

శిథిల క్వార్టర్లను పట్టించుకునే వారేరి?

... 5వ పేజీ తరువాయి

సంబంధించి ఇద్దరు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి వైద్య సేవలందించాలి. కానీ తగిన వసతి లేక కేవలం స్టాఫ్ నర్సులు మాత్రమే శిథిలావస్థకు చేరిన గృహాల్లో ఉంటున్నారు. మిగిలిన వారు వేర్వేరు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. శిథిలమైన క్వార్టర్లను స్వల్ప మరమ్మతులు చేసుకుని 108, 104 సిబ్బంది ఉంటున్నారు.

డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 1992వ సంవత్సరంలో వైద్యాధికారితో పాటు మిగిలిన సిబ్బందికి ఆరు క్వార్టర్లు నిర్మించారు. అయితే ఈ క్వార్టర్లలో ఎవ్వరూ నివాసం ఉండడం లేదు. దీంతో ఈ క్వార్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. తలుపులు, కిటికీలు దొంగలు పరమయ్యాయి. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారు స్థానికంగా ఉండాలనే కాంక్ష ఉన్నా.. తగిన వసతి లేక నిత్యం నర్సీపట్నం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 1985లో చింతపల్లి ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణ చొరవతో కొయ్యూరులో గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు. అప్పట్లోనే పాఠశాల ఆవరణలో సిబ్బంది కోసం 14 క్వార్టర్లు నిర్మించారు. వాటిలో నాలుగు క్వార్టర్లు పూర్తిగా శిథిలం కాగా మరో 12 నివాసయోగ్యంగా లేకున్నా తాత్కాలికంగా స్వల్ప మరమ్మతులు చేసుకుని ప్రిన్సిపాల్ తదితర సిబ్బంది ఉంటున్నారు. ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది 22 మంది ఉన్నారు. నివాసయోగ్యంగా లేని క్వార్టర్లలో కొందరు ఉంటున్నా.. మిగిలిన వారికి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక మైదాన ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న పరిస్థితి నెలకొంది.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు కొయ్యూరు మండలంతో పాటు మిగిలిన మండలాలలో గల పీహెచ్‌సీ, గురుకుల పాఠశాలల్లో గల సిబ్బంది వసతి గృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో వీటికి సంబంధించి మరమ్మతులకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. నిధులు రాగానే మరమ్మతులు చేస్తాం.

-రాజు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

☛ సంక్షిప్తంగా..

ఐటీడీఏ క్వార్టర్స్‌లో తాగునీటి సరఫరా బంద్

చింతపల్లి, జూలై 17: మండల కేంద్రంలోని ఐటీడీఏ క్వార్టర్స్‌కు నీటి సరఫరా నిలిచిపోయింది. వారం రోజులుగా స్థానికులకు తాగునీరు అఅందడం లేదు. దీంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో ఐటీడీఏ క్వార్టర్స్‌కు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేశారని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పది రోజుల క్రితం వరకు సరఫరా చేశారని, వారం రోజులుగా మరలా ఆపేశారని వారు వాపోయారు. ఫలితంగా తాగునీటి కోసం తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన సద్వినియోగం చేసుకోండి

పాడేరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జె.హుస్సేన్ గురువారం ఏజెన్సీ పర్యటనను గిరిజన విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ముఖి శేషాద్రి, బోయపల్లి సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గిరిజన ఉద్యోగుల భవనంలో అందిరతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. గిరిజనుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చేందుకు సంఘాల నేతలు కృషి చేయాలని వారు కోరారు.

పాఠశాల భవనం నిర్మించరూ..

పాడేరు రూరల్, జూలై 17: మండలంలోని సలుగు పంచాయతీ బూరుగుచట్టు గ్రామంలో పాఠశాల భవనం నిర్మించాలని టీడీపీ నాయకుడు వనుగు సురేంద్ర డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలకు భవన సౌకర్యం లేకపోవడంతో పదేళ్ల క్రితం గ్రామస్థులు ఏర్పాటుచేసిన చిన్న ఇంటిలోనే తరగతులు నిర్వహించాల్సి వస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామంలో 1, 2 తరగతులు చదువుతున్న విద్యార్థులు సుమారు 36 మంది ఉన్నారని, వారంతా రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న డల్లాపల్లి గ్రామంలో ఉన్న పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని వాపోయారు. అల్లూరి జిల్లా కేంద్రానికి 17 కిలోమీటర్లు దూరంలో ఉన్న తమ గ్రామంలో పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఐటీడీఏ అధికారులను వేడుకుంటున్నా ఫలితం లేకపోతున్నదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గ్రామంలో పాఠశాల భవనం మంజూరు చేయాలని, లేకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

స్త్రీ వైద్య నిపుణులను అందుబాటులో ఉంచండి

చింతపల్లి, జూలై 17: ఏరియా ఆస్పత్రిలో స్త్రీ వైద్య నిపుణులు అన్ని వేళలా అందుబాటులో ఉండేలా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో పేరుకే మూడు స్త్రీ వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేశారని, ప్రస్తుతం ఒక్కరే విధుల్లో ఉన్నారని చెప్పారు. దీంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఆ ఒక్క డాక్టర్ కూడా సెలవు పెడితే గర్భిణులకు చికిత్స, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు నిలిచిపోతున్నాయన్నారు. ఇప్పటికైన కలెక్టర్, డీసీహెచ్‌ఎస్ స్పందించి పాడేరులో విధులు నిర్వహిస్తున్న ఇక్కడి స్త్రీ వైద్య నిపుణుల డిప్యుటేషన్ రద్దు చేయాలని, అన్ని వేళలా ముగ్గురు వైద్యులను అందుబాటులో ఉంచాలని ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రీమల ఆనందరావు, చింతాడ చిన్న, అనిల్, రఘుపతి పాల్గొన్నారు.

వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

సీలేరు, జూలై 17: వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులపై కేకలు వేసిన సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సౌమ్యపై అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పి.దుర్గో ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక వైద్యుల పనితీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినా తీరు మారలేదని చెప్పారు. వైద్యం కోసం వచ్చిన రోగుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదని ఆయన మండిపడ్డారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

పంపిణీకి సిద్ధంగా ఎరువులు

అరకులోయ, జూలై 17: గిరిజన రైతులకు ఖరీఫ్ పంటల సాగు కోసం అవసరమైన ఎరువులను పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఫణీంద్రవర్మ తెలిపారు. గురువారం నుంచి అరకు రైతు భరోసా కేంద్రంలో ఎరువులు, డీఏపీ పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్సులతో స్వయంగా రావాలని సూచించారు. మొదటి దఫా 12 టన్నుల యూరియా, 12 టన్నుల డీఏపీ పంపిణీకి సిద్ధం చేసినట్టు చెప్పారు. యూరియా బస్తా రూ..270 రూపాయలు, డీఏపీ బస్తా రూ.1350 చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

విద్యార్థులకు వాణిజ్య వనరులపై అవగాహన అవసరం

డుంబ్రిగుడ, జూలై 17: వ్యవసాయ, వాణిజ్య వనరుల ప్రాధాన్యతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని టెక్నో సర్వే సంస్థ అసోసియేట్ రాకేష్ సూచించారు. అరకు కాఫీ ప్రపంచంచలోనే మంచి ప్రాధాన్యత పొందిందని చెప్పారు. జిల్లాలో కాఫీని ప్రధాన పంటగా పండించడం జరుగుతందని, ఈ పంట ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన అవసరమని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సంస్థ ప్రతినిధులు రవికుమార్, స్వాములు, ప్రశాంత్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి గాయాలు

సీలేరు, జూలై 17: గుమ్మిరేవుల పంచాయతీ మారుమూల గ్రామం ఊడలమర్రి వద్ద బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకలు ఢీకొన్న సంఘటనలో ఐదుగురు గాయపడ్డారు. కొయ్యూరు మండలం మఠంభీమవరం గ్రామానికి చెందిన సిరిబాల ధర్మరాజు, కాకనూరు గ్రామానికి చెందిన జర్తా బుజ్జిబాబు, ముర్ల బాలయ్య, వంతల చంద్రబాబు, తార్నివాడకు చెందిన కొర్రా జిత్తు గాయపడ్డ వారిలో ఉన్నారు. వీరిలో సిరిబాల ధర్మరాజు, వంతల చంద్రబాబు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించామని వైద్యాధికారి హిమబిందు తెలిపారు.